సాక్షి
వికారాబాద్
ఆదివారం । 17 । మార్చి । 2024



ఒంటిపూట..

ఎండలు మండుతుండటంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ఒంటి పూట బడులను ప్రారంభించింది. 8లో▸



భక్తిని పెంపొందించుకోవాలి

ప్రతిఒక్కరూ భక్తిభావం పెంచుకోవాలని, దైవ చింతనతో ముక్తి లభిస్తుందని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
ఆదివారం (సాయంత్రం)	సోమవారం (ఉదయం)
6:32	5:00

మళ్లీ ఓట్ల పండుగ..

ఎన్నికల షెడ్యూల్ విడుదలతో పార్టీలు బిజీబిజీ

- ఒక్కసారిగా వేడెక్కిన వాతావరణం
- ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్, బీజేపీ
- ఇంకా ఖరారు చేయని కాంగ్రెస్
- జిల్లాలో ఓటర్లు 9,84,068మంది
- 1,133 పోలింగ్ కేంద్రాలు

వికారాబాద్: లోక్‌సభ ఎన్నికలకు నగారా మోగింది. అందరూ ఊహించినట్లుగానే కేంద్ర ఎన్నికల కమిషన్ లోక్‌సభ ఎన్నికల తేదీలను శనివారం ప్రకటించింది. ఏప్రిల్‌లో ఎన్నికలు ప్రారంభమై జూన్ 6వ తేదీతో ముగియనున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే కోడ్ అమల్లో ఉండగా శనివారం నుంచి లోక్‌సభ కోడ్ అమల్లోకి వచ్చింది. ఇప్పటికే ఎన్నికల కోసం సిద్ధమైన అధికారులు కోడ్ కూయడంతో గోడలపై రాతలు, బ్యానర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారు. రాజకీయ పార్టీల విగ్రహాలకు ముసుగులు తొడిగారు. ఇప్పటికే ఈవీ ప్యాడ్లు, ఈవీఎంలు సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం ఏర్పాటు తరువాత ఇప్పటి వరకు మూడు సార్లు ఎన్నికలు జరగ్గా దివంగత నాయకుడు జైపాల్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, గడ్డం రంజిత్‌రెడ్డి ఎంపీలుగా సేవలందించారు. ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల కానుండగా ఏప్రిల్ 25 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 29న నామినేషన్ల ఉపసంహరణ, మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు.

మొదలైన సందడి

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో జిల్లాలో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికార యంత్రాగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లపై ప్రజలకు అవగాహన కల్పించడం, పరిశీలన వంటి కార్యక్రమాలను పూర్తి చేశారు. ఓటర్ల జాబితాలో తప్పుల సవరణ, కొత్త ఓటర్ల నమోదు, బోగస్ ఓటర్ల ఏరివేత వంటివి పూర్తి చేసి ఓటరు తుది జాబితా కూడా ప్రకటించారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోకి వికారాబాద్, పరిగి, తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్లు రానుండగా కొడంగల్ మహబూబ్‌నగర్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోకి వెళ్లింది. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించగా అధికార కాంగ్రెస్ ఇంకా ప్రకటించలేదు.

జిల్లాలో ఓటర్ల వివరాలు..

జిల్లాలో మొత్తం ఓటర్లు 9,84,068 ఉండగా, వీరిలో పురుషులు 4,86,109,స్త్రీలు 4,97,220, ట్రాన్స్ జెండర్లు 39 మంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. నియోజకవర్గాల వారీగా ఇలా.. వికారాబాద్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,31,679 ఉండగా, పురుషులు 1,15,019 మంది, మహిళలు 1,16,647 మంది, ట్రాన్స్ జెండర్లు 13 మంది ఉన్నారు. తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్‌లో మొత్తం ఓటర్లు 2,43,849 మంది ఉండగా, పురుషులు 1,18,228 మంది, మహిళలు 1,25,614 మంది, ట్రాన్స్ జెండర్లు 07 మంది ఉన్నారు. పరిగి నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,66,273 మంది ఉండగా, పురుషులు 1,33,625 మంది, మహిళలు 1,32,639 మంది, 09 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు. కొడంగల్‌లో మొత్తం ఓటర్లు 2,42,267 మంది ఉండగా, పురుషులు 1,19,237, మహిళలు 1,23,020 మంది, ట్రాన్స్ జెండర్లు 10 మంది ఉన్నారు.

1,133 పోలింగ్ కేంద్రాలు

జిల్లాలో 1,133 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. పరిగి నియోజకవర్గంలో 305 పోలింగ్ కేంద్రాలు, వికారాబాద్‌లో 284, తాండూరులో 269, కొడంగల్‌లో 275 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. తాండూరులో 8, కొడంగల్‌లో 7 ఆక్జిలరీ పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఉన్న పోలింగ్ కేంద్రాలు దూరంగా ఉండటం తదితర కారణాలతో బై నంబర్లతో ఈ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి చిత్రంలో ఎస్పీ కోటిరెడ్డి

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి కోరారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికలు సాఫీగా జరగడానికి సహకరించాలని కోరారు. సీ విజిల్‌కు వచ్చే ఫిర్యాదులను సత్వరం పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. శాంతిభద్రతలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జిల్లా సరిహద్దులో ఏడు చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అవసరాన్ని బట్టి వాటి సంఖ్యను పెంచుతామన్నారు. ఇప్పటికే 208 లైసెన్స్ ఆర్మ్స్ డిపాజిట్ చేసుకోవడం జరిగిందన్నారు. కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, ఎం.వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సునీత ఔట్.. రంజిత్ ఇన్!





బీఆర్ఎస్‌కు షాక్.. కాంగ్రెస్ గూటికి రంజిత్?

- చేవెళ్ల తెరపైకి ఆయన పేరు.. మల్కాజ్‌గిరి రేసులో సునీత
- రోజుకో మలుపు తిరుగుతున్నకాంగ్రెస్ రాజకీయం

వికారాబాద్: చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థిత్వంపై కాంగ్రెస్ అధిష్టానం పునరాలోచనలో పడింది. వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని పక్కన పెట్టిన అధిష్టానం..తాజాగా బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి పేరును పరిశీలిస్తోంది. ఈ మేరకు సంకేతాలిచ్చిన పీసీసీ నాయకత్వం మల్కాజ్‌గిరి స్థానం నుంచి పోటీ చేయాలని సునీతకు సూచించినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలతో చేవెళ్ల రాజకీయం రోజుకో మలుపు తిరుగుతోంది. చేవెళ్ల ఎంపీ టికెట్ హామీ లభించడంతో మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి దంపతులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఆ తర్వాత చేవెళ్లలో జరిగిన బహిరంగ సభలోనూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పక్కనే నిలబడ్డ సునీత కార్యకర్తలకు అభివాదం చేశారు. దీంతో పరోక్షంగా అభ్యర్థి ఎవరనేది కార్యకర్తలకు సంకేతాలిచ్చారు. ఇప్పటికే ఎన్నికల ప్రచారాన్ని కూడా ప్రారంభించిన సునీత నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. మరోవైపు మహేందర్‌రెడ్డి కూడా బీఆర్ఎస్‌లోని తన సన్నిహితుల మద్దతు కూడగట్టేదిశగా మంతనాలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను ఈ నెలాఖరులోపు పార్టీలోకి రప్పించేలా తెరవెనుక పావులు కదుపుతున్నారు. అయితే, అనూహ్యంగా రంజిత్‌రెడ్డి తెరమీదకు రావడంతో 'పట్నం' సీటుకు ఎసరొచ్చింది.

తాజాగా మల్కాజ్‌గిరి రేసులో..

చేవెళ్ల స్థానానికి రంజిత్‌రెడ్డి పేరును దాదాపు ఖరారు చేసిన కాంగ్రెస్ హైకమాండ్.. సునీతను మల్కాజ్‌గిరి నుంచి పోటీ చేయమని కోరినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా రెండు సార్లు ప్రాతినిథ్యం వహించినందున మేడ్చల్ జిల్లాపై మంచి పట్టుందని, ఇది కలిసివస్తుందని కాంగ్రెస్ నాయకత్వం అభిప్రాయపడుతోంది. దీనికితోడు బలమైన సామాజికవర్గం, మహిళ కూడా కావడంతో నగర ఓటర్ల మద్దతు లభిస్తుందనే అంచనా వేస్తోంది. అయితే, సునీత మాత్రం మల్కాజ్‌గిరి నుంచి పోటీ చేసే విషయంలో సందిగ్ధంలో పడ్డట్లు తెలుస్తోంది. చేవెళ్ల లోక్‌సభ సెగ్మెంట్ అన్ని విధాలా బాగుంటుందని, స్థానికతకు తోడు బలమైన కేడర్, గ్రామీణ ప్రాంత ఓటర్లతో ఉన్న విస్తృత పరిచయాలు గెలుపు తీరాలకు చేరుస్తాయనే ధీమాతో ఉన్నారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గం పూర్తిగా పట్టణ ఓటర్లతో మిళితం కావడం..దేశంలోనే అతిపెద్ద పార్లమెంటు స్థానాల్లో ఒకటి కావడం.. కొత్తసెగ్మెంట్ కావడంతో ప్రచారం అంత ఈజీ కాదనే భావిస్తున్నట్లు తెలిసింది.

రూటు మార్చిన రంజిత్

సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి బీఆర్ఎస్‌కు షాక్ ఇచ్చారు. గులాబీ అధిష్టానం ఆయన అభ్యర్థిత్వానికి ఓకే చెప్పినప్పటికీ ఆయన మాత్రం పోటీకి విముఖత చూపారు. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం అనంతరం రంజిత్ మనసు కాంగ్రెస్ వైపు మళ్లింది. ఈ పరిణామాలను గమనించిన గులాబీ బాస్..చేవెళ్ల టికెట్‌ను రంజిత్‌కు ఇస్తున్నట్లు అన్ని సీట్లకంటే ముందే ప్రకటించారు. మాజీ మంత్రి పట్నం దంపతులు, మాజీ ఎమ్మెల్యే తీగల, ఆయన కోడలు రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పడం.. కొందరు ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌తో టచ్‌లోకి వెళ్లడంతో పోటీకి సంశయించారు. బీఆర్ఎస్ అధిష్టానానికి కూడా దూరం పాటించారు. ఈ నేపథ్యంలో కేసీఆర్.. ఇటీవల రంగారెడ్డి జిల్లా నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్‌ను అభ్యర్థిగా ఖరారు చేశారు. దీంతో బీఆర్ఎస్ అభ్యర్థిత్వంపై సస్పెన్స్ వీడింది. అయితే, ఇన్నాళ్లూ మౌనంగా ఉన్న రంజిత్‌రెడ్డి వ్యూహాత్మకంగా పావులు కదిపి కాంగ్రెస్ తరుపున పోటీకి రెడీ కావడం..పీసీసీ కూడా పచ్చజెండా ఊపడం ఉమ్మడి జిల్లా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



బాధ్యతల స్వీకరణ

అనంతగిరి: వికారాబాద్ ఆర్డీఓగా ఎం వాసుచంద్ర శనివారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ ఆర్డీఓగా విధులు నిర్వహించి ఆయన బదిలీపై వికారాబాద్‌కు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన విజయకుమారిని ఏటూరు నాగారానికి బదిలీ అయ్యారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

అనంతగిరి: జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ నారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 80 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 6,913మంది బాలురు, 6,499 మంది బాలికలు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 5 నిమిషాలు ఆలస్యంగా (ఉదయం 9.35 నిమిషాల వరకు) వచ్చిన విద్యార్థులను కూడా పరీక్ష కేంద్రంలోకి అనుమతించనున్నట్లు తెలిపారు. గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు వేసవిని దృష్టిలో ఉంచుకొని ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే డీఈఓ కార్యాలయ ఫోన్ నంబరు 08416 235245లో సంప్రదించాలని సూచించారు.

చరిత్రలో నిలబడి

150 years



'అ'క్షర సుమమై 'ఆ' బడి వికసించింది. ఇద్దరు ముఖ్యమంత్రులు, ఓ గవర్నర్‌తో సహా ఎంతో మంది మేధావులను.. ఉద్దండులను అందించింది. ఇక్కడి చదువులమ్మ చెట్టు నీడలో అక్షర శ్రీకారం చేసిన ఎందరో తమ భవితకు బాటలు వేసుకుని విజయతీరాలకు చేరుకున్నారు. దినదిన ప్రవర్ధమానమై నేటికీ తన ప్రత్యేకతలు నిలుపుకొంటూ గ్రామ చరిత్రతో పాటే పాఠశాల ఘనత వహించింది. ప్రస్తుతం 150 ఏళ్ల చరితకు సాక్ష్యంగా నిలిచింది ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల. స్వాతంత్ర్యానికి పూర్వమే ఏర్పాటైన ఈ బడి ఏటా వందలాది మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతోంది.

సండే స్పెషల్

మొగిలిగిద్ద పాఠశాల వైభవానికి 150 ఏళ్లు

- ఎందరో ఉద్దండులతో అక్షరాలు దిద్దించిన ఘనత
- ఇద్దరు ముఖ్యమంత్రులు, ఓ గవర్నర్‌కు విద్యాబుద్ధులు నేర్పిన విద్యా నిలయం
- పదిహేను పదుల ప్రస్థానం పూర్తి
- ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్తుల సన్నద్ధం



మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం

షాద్‌నగర్: షాద్‌నగర్ పట్టణానికి సుమారు 9 కిలోమీటర్ల దూరంలో పరిగి రోడ్డు పక్కన ఉన్న మొగిలిగిద్ద గ్రామం ఎంతో ప్రత్యేకతతో కూడుకుంది. నియోజకవర్గంలోనే ఇది అతిపెద్ద గ్రామం. స్వాతంత్ర్యానికి పూర్వమే ఇక్కడ పోలీస్ స్టేషన్, గ్రంథాలయంతో పాటు మొట్టమొదటి పాఠశాల ఏర్పాటయ్యాయి. చుట్టుపక్కల సుమారు 20 గ్రా మాల విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. 1873లో ఈ పాఠశాల నిర్మాణం జరిగింది. నియోజకవర్గం పరిధిలో ఒకే ఒక్క పాఠశాల మంజూరు కాగా చుట్టుపక్కల ఉండే గ్రామాల విద్యార్థులకు చేరువగా ఉంటుందనే ఉద్దేశంతో దాన్ని మొగిలిగిద్దలో ఏర్పాటు చేశారు. అప్పటి నుండి ఇప్పటి వరకు ఏటా సుమారు 500 మంది విద్యార్థులకు అక్షరాలు నేర్పుతోంది. ఈ పాఠశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు దేశవిదేశాల్లో వివిధ హోదాల్లో స్థిరపడి పాఠశాల పేరును నిలబెడుతున్నారు.

నిజాం పాలనలో..

రజాకార్లు, నిజాం పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించిన తుర్రెబాజ్‌ఖాన్ అప్పట్లో వారి నుంచి తప్పించుకునేందుకు మొగిలిగిద్దలో తలదాచుకున్నట్లు చరిత్ర చెబుతోంది. తుర్రెబాజ్‌ఖాన్‌కు మొగిలిగిద్ద వాసులు ఆశ్రయం ఇచ్చారన్న విషయం తెలుసుకున్న నిజాం అతడిని హైదరాబాద్ తీసుకెళ్లి ఉరి తీశారని చరిత్రకారులు చెబుతున్నారు. తుర్రెబాజ్‌ఖాన్‌కు ఆశ్రయం ఇచ్చిన గ్రామస్తులు తమకు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారనే అనుమానంతో.. వారు ఉద్యమం వైపు మళ్లకుండా విద్యా పరంగా చైతన్యం చేయాలనే ఉద్దేశంతో నిజాం నవాబులు గ్రామంలో 1873లో పాఠశాలను కట్టించారు. మొదట్లో ఉర్దూ మీడియం కొనసాగింది. 1948లో తెలుగు మీడియాన్ని ప్రారంభించారు.

ఉత్సవాలకు సన్నద్ధం

ప్రస్తుతం మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల 150 వసంతాలను పూర్తి చేసుకుని ఉత్సవాలను జరుపుకొనేందుకు సన్నద్ధమవుతోంది.ఇందుకు తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా ఆచార్య హరగోపాల్ సోదరుడు శ్యాంసుందర్, సభ్యులు ఆనందీశ్వర్‌రెడ్డి, గంగాధర్ తదితరులను ఎన్నుకున్నారు.

అక్షర యాత్రలో ప్రముఖులు

స్వతంత్ర ఉద్యమకారుడిగా, బహుభాషా కోవిధుడిగా, రచయితగా, హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా 1952–56 మధ్య పని చేసిన బూర్గుల రామకృష్ణారావు ఈ పాఠశాల విద్యార్థి కావడం విశేషం. 1970 దశకంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా పని చేసిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ఇక్కడే కొంత కాలం చదివారు. మర్రి చెన్నారెడ్డి కొందుర్గు మండలం రేగడిచిల్కమర్రి గ్రామంలో తన అమ్మమ్మ ఇంట్లో ఉండి రెండు, మూడు తరగతులు ఇక్కడే చదివారని గ్రామస్తులు చెబుతున్నారు. వీరే కాకుండా గతంలో విద్యాశాఖ మంత్రిగా పని చేసిన శ్రీనివాసరావు, ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా పని చేసిన ఫరూఖ్‌నగర్ మండలం అన్నారం గ్రామ నివాసి సత్యనారాయణరెడ్డి, స్వాతంత్ర్య సమరయోధుడు, విద్యావేత్త రంగారావు వంటి వాళ్లు ఈ పాఠశాల విద్యార్థులే. ప్రస్తుతం పౌరహక్కుల సంఘం నాయకుడిగా, ప్రొఫెసర్‌గా అందరికీ సుపరిచితుడైన ఆచార్య హరగోపాల్ ఇక్కడే విద్యాబుద్ధులు నేర్చుకున్నారు. ప్రస్తుతం హరగోపాల్ సోదరుడు శ్యాంసుందర్ పాఠశాల అభివృద్ధికి తనవంతు ప్రయత్నం చేస్తున్నారు.

ఆనందంగా ఉంది



పురాతనమైన మొగిలిగిద్ద పాఠశాలకు ఎంతో ఘనమైన చరిత్ర ఉంది. ఎందరో ప్రముఖులు ఈ పాఠశాలలో విద్యను అభ్యసించి ఉన్నతమైన స్థానాల్లో ఉన్నారు. పాఠశాల 150 ఏళ్లు పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉంది

– సిరాజ్, గ్రామస్తుడు, మొగిలిగిద్ద

భవిష్యత్తుకు పునాది



నేను మొదట్లో పాఠశాలకు వెళ్లినప్పుడు నాకు ఉర్దూలోనే పాఠాలు బోధించారు. 1948లో తెలుగు మీడియం ప్రారంభించారు. మొగిలిగిద్ద పాఠశాల ఎంతో మందికి మంచి విద్యను అందించి భవిష్యత్తుకు పునాది వేసింది.

– హరగోపాల్, ప్రొఫెసర్

ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నాం



అందరి సహకారంతో 150 ఏళ్ల ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. తాత్కాలిక కమిటీని ఎన్నుకొని సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నాం. త్వరలో వేడుకలకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తాం.

– శ్యాంసుందర్, పాఠశాల వేడుకల కమిటీ గౌరవ అధ్యక్షుడు

న్యూస్‌రీల్

తక్షణం రంగంలోకి దిగండి

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు ఎన్నికల నిర్వహణకు సిద్ధమవ్వాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. శనివారం ఆయన హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కోడ్ అమల్లోకి వచ్చినందున తక్షణం పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగులను తొలగించాలన్నారు. జిల్లాస్థాయిలో ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీమ్‌లను అందుబాటులోకి తేవాలన్నారు. సువిధ దరఖాస్తులను పరిశీలించి అవసరమైన వాటికి వెంటనే అనుమతులు ఇవ్వాలని సూచించారు. ప్రజాప్రతినిధ్య చట్టం 129 సెక్షన్‌పై అవగాహన కల్పించాలన్నారు. శాంతిభద్రతలు, పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇవ్వడం తోపాటు, బందోబస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ కోటిరెడ్డి, అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, వికారాబాద్, తాండూరు ఆర్డీఓలు ఎం వాసుచంద్ర, శ్రీనివాసరావు, డీఆర్‌డీఓ శ్రీనివాస్, జిల్లా పరిషత్ సీఈవో సుధీర్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ తదితరులు పాల్గొన్నారు.

రాజీ పడితే విజయం మీదే

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్
- లోక్ అదాలత్‌లో 623 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్

అనంతగిరి: లోక్ అదాలత్‌లో రాజీ పడితే ఇరువర్గాలు విజయం సాధించినట్లేనని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే సుదర్శన్ అన్నారు. శనివారం వికారాబాద్‌లోని జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 623 కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇరువర్గాలు విశాల దృక్పథంతో ఆలోచిస్తే కేసుల నుంచి విముక్తి పొందవచ్చని తెలిపారు. రాజీ మార్గమే రాజ మార్గమన్నారు. ప్రతి వ్యక్తికి చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిషోర్, సీనియర్ సివిల్ జడ్జి డీబీ శీతల్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్, అదనపు న్యాయమూర్తి శతిదూత, ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, పీపీలు రాజేశ్వర్, అన్వేష్‌సింగ్, సమీనబేగం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ధర్మపరిరక్షణ బీజేపీతోనే సాధ్యం



అయోధ్య ప్రసాదం పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

కుల్కచర్ల: ధర్మపరిరక్షణ బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ గిరిజన మోర్చా జిల్లా కార్యదర్శి శంకర్ నాయక్ అన్నారు. శనివారం చౌడాపూర్ మండలం రాంసింగ్ నాయక్ తండాలో ఇంటింటికీ అయోధ్య శ్రీరాముడి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ధర్మపరిరక్షణకు కృషి చేసే వారికి మనం మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అవినీతి రహిత పాలన బీజేపీ సర్కారుతోనే సాధ్యమన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు, పేదలకు అండగా ఉండే కొండా విశ్వేశ్వర్ రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పాండు, సంజ్యానాయక్, మంగ్య, మణనాయక్, దశరథ్, రెడ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడితే గెలుపు మనదే

చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్: గ్రామస్థాయి నుంచి నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని, అప్పుడే గెలుపు వరిస్తుందని చేవెళ్ల లోక్‌సభ బీజేపీ అభ్యర్థి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. హిమాయత్‌నగర్ చౌరస్తాలోని కంజర్ల కన్వెన్షన్ హాల్ శనివారం ఉమ్మడి జిల్లా ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్కసారి అధికారం కోల్పోతేనే బీఆర్ఎస్ పార్టీ గంపగుత్తగా ఖాళీ అయిందన్నారు.

క్లుప్తంగా

సీజ్ చేసిన ఇసుక వేలం


వేలం వేసిన ఇసుక

కుల్కచర్ల: రెవెన్యూ అధికారులు, పోలీసులు సీజ్ చేసిన ఇసుకను శనివారం వేలం వేశారు. కుల్కచర్ల మండలం అనంతసాగర్‌లో సుమారు 15 ట్రాక్టర్ల ఇసుకను తహసీల్దార్ మురళీధర్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన చిల్ల మహేశ్ రూ.54,500లకు ఇసుక హక్కులను స్వాధీనం చేసుకున్నారు. రెవెన్యూ శాఖకు వేలం డబ్బులు చెల్లించిన అనంతరం ఇసుకను తరలించేందుకు అధికారులు నిర్ణయించారు. నిబంధనల మేరకు అమ్ముకోవచ్చని తహసీల్దార్ మురళీధర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో గిర్దవరి ఖాజ, సీనియర్ అసిస్టెంట్ శీనయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య

పూడూరు: అప్పులబాధతో కౌలురైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుత్బుల్లాపూర్‌కు చెందిన కుర్వరాజు(28), ఆదే గ్రామానికి చెందిన దొడ్ల రాజేందర్‌రెడ్డి వద్ద 6 ఎకరాల పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. పెట్టుబడుల కోసం తెలిసిన వారి వద్ద , తన భార్య మమత బంగారు వస్తువులు తాకట్టుపెట్టి అప్పు చేశాడని తెలిపారు. పంటలు దిగుబడి రాకపోవడంతో చేసిన అప్పులు తీర్చేలేక మనస్తాపంతో గ్రామ శివారులోని తుమ్మచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన వ్యక్తి

పూడూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన చన్గోముల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమన్‌గుర్తి స్టీల్ ఫ్యాక్టరీ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న వ్యక్తికి తీవ్రగాయాలయి అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతుడిది పరిగి మండలం సయ్యద్‌పల్లి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఒంటిపూట.. కనిపెట్టు ఓ కంట

- పిల్లల విషయంలో అప్రమత్తత అవసరం
- బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


చెరువులో ఈత కొడుతున్న పిల్లలు

దౌల్తాబాద్: ఎండలు మండుతుండటంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ఒంటి పూట బడులను కొనసాగిస్తుంది. మధ్యాహ్నం సెలవు కావడంతో పిల్లలు ఆటలు ఆడుకోవడానికి బయటకు వెళ్తుంటారు. ఒక్కోసారి అనందం వెన్నంటే విషాదాలు పొంచి ఉంటాయి. ఈ విషయాన్ని తల్లిదండ్రులు గ్రహించి పిల్లల విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. పిల్లలు సరదాలకు అలవాటు పడి తల్లిదండ్రులు వారించినా ఇంటి పట్టున ఉండేందుకు సుముఖత చూపరు. ఇంట్లో చెప్పపెట్టకుండా బయటకు వెళ్లి ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఎక్కువ. వారిని ఓ కంట పెట్టాల్సిన అవసరం ఉంది.

సరదా మాటున ప్రమాదం..

మధ్యాహ్నం సెలవు కావడంతో పిల్లలు సరదాగా బావుల్లో, చెరువుల్లో స్నేహితులతో కలిసి ఈత నేర్చుకోవడానికి వెళ్తుంటారు. ఈత నేర్చుకునే క్రమంలో బావులు, చెరువులు, కుంటలు వాగులు లోతును అంచనా వేయక అందులోకి దిగుతారు. తీరా దిగాక లోతు ఎక్కువగా ఉండడం, మట్టి పేరుకుపోయి ఉండడం తదితర కారణాల వల్ల చిన్నారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. తల్లిదండ్రులు పర్యవేక్షణలోనే ఈత నేర్చుకోవాలి. అలాగే ఎండలో తిరగడం వల్ల అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. వడదెబ్బకు గురవ్వడం జ్వరం వంటివి రావొచ్చు. కావునా పిల్లలను నీడ పట్టునే ఉండేలా చూడాలి.

వాహనాలతో జాగ్రత్త...

ద్విచక్రవాహనాలు, సైకిళ్లు అంటే పిల్లలకు ఇష్టం ఎక్కువ. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వాటిని నడుపుతూ రోడ్డెక్కితే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. కావునా వాటికి దూరంగా ఉంచాలి. అవసరమైతే పెద్దలు పక్కనే ఉండి నడపడం నేర్పాలి.

జాగ్రత్తలు తీసుకోండి...

- ▲ బడి వదలాగానే మధ్యాహ్నం వేళ అవసరమైతే తప్ప పిల్లలను బయటకు పంపొద్దు.
- ▲ వీలును బట్టి తల్లిదండ్రులు పిల్లలతో గడిపేందుకు అధిక సమయం కేటాయించాలి
- ▲ ఇంటి పట్టున ఉండి పిల్లలకు (హోంవర్క్) లో సహాయం చేయాలి.
- ▲ పాఠశాల నుంచి మధ్యాహ్నం ఇంటికి వచ్చాక చిన్నారులకు పుస్తక పఠనం అలవాటు చేయాలి. నీతికథలు స్ఫూర్తి గాథలు చదివేలా ప్రోత్సహించాలి.
- ▲ అవసరమైతే నీడపట్టున ఆడుకునే ఆటలకు ప్రాధాన్యం చెప్పాలి. చదరంగం, క్యారమ్స్ వంటి ఆటలు ఆడేలా చూడాలి.

గడువులోగా ఎఫ్‌సీఐకి పంపాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్

అనంతగిరి: ఖరీఫ్‌కు సంబంధించిన సీఎంఆర్ నిర్దేశించిన సమయంలోపు ఎఫ్‌సీఐకు చేరేలా చర్యలు తీసుకోవాలని పౌర సరఫరాల కమిషనర్ డీఎస్.చౌహాన్ పేర్కొన్నారు. శనివారం ఖరీఫ్ 2023–24కి సంబంధించిన సీఎంఆర్‌పై అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాల అధికారులు, జిల్లా మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ సీఎంఆర్ డెలివరీలను ఎఫ్‌సీఐకి సకాలంలో ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. రైస్ మిల్లుల వద్ద పౌర సరఫరాల డైరెక్టర్ ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు. బియ్యం పంపిణీ నాణ్యతలో రాజీ పడే ఆస్కారం లేదన్నారు. ఖరీఫ్ సీజన్ కోసం మిల్లుల్లో సీఎంఆర్ మిల్లింగ్‌పై దృష్టి సారించాలని జిల్లా పౌర సరఫరాల అధికారులను జిల్లా మేనేజర్లను కమిషనర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా మేనేజర్ సుగుణబాయి, జిల్లా పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నారు.

భక్తిని పెంపొందించుకోవాలి


ప్రసాద్‌కుమార్‌కు స్వామివారి ఫొటోను బహూకరిస్తున్న గ్రామస్తులు

మోమిన్‌పేట: మండలంలోని దుర్గంచెర్వులో నిర్వహిస్తున్న భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర మహోత్సవంలో భాగంగా శుక్రవారం రాత్రి స్పీకర్ ప్రసాద్‌కుమార్ స్వామివారిని దర్శించుకొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు భక్తి భావనలను పెంపొందించుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరు ఆలయాలకు వెళ్లి దేవుడిని పూజించాలని కోరారు. జాతర చేయడం వల్ల గ్రామస్తులు కలిసి మెలిసి ఆనందంగా గడుపుతారని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శంకర్, పార్టీ సీనియర్ నాయకులు నరోత్తంరెడ్డి, నర్సింలు, వేమారెడ్డి, శ్రీనివాస్‌గౌడు, సత్యనారాయణ గౌడు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

రాజీయే రాజమార్గం

పరిగి ఇన్‌చార్జి జడ్జి శిల్ప


లోక్ అదాలత్‌లో పరిగి జడ్జి శిల్ప

పరిగి: రాజీయే రాజమార్గమని ఇన్‌చార్జ్ పరిగి జడ్జి నాగుల శిల్ప అన్నారు. శనివారం వివిధ కేసులపై జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. మొత్తం 431 కేసులను ఇరువురి రాజీ ద్వారా పరిష్కరించారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ.. పంతాలకు పోయి గొడవలు పెంచుకోవద్దని సూచించారు. క్షణికావేశంలో చేసిన తప్పులు పలు కేసులకు దారితీస్తాయన్నారు. కావునా, ఎలాంటి కేసులైన లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని, ఇరువురి రాజీతో కేసుల సమస్యలు తక్షణమే పరిష్కారమవుతాయన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కామైన కేసులు అంతిమ పరిష్కారంగా పరిగణిస్తారన్నారు. కేసులున్నా వారు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

ధారూరు పీఏసీఎస్ ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి


శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సత్యనారాయణరెడ్డి

ధారూరు: పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన రైతు శ్రీనివాస్ కరెంట్ షాక్‌తో మృతి చెందారని ధారూరు పీఏసీఎస్ ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఆయన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి ప్రకటించారు. అనంతరం ధారూరు పీఏసీఎస్‌లో మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగారం పీఏసీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన హమాలి సంఘంలో శ్రీనివాస్ పని చేసే వాడని పేర్కొన్నారు. నాగారంలోని ఫర్టిలైజర్ సెంటర్, వరి కొనుగోలు కేంద్రంలో హమాలిగా గత పదేళ్లుగా పని చేశాడని వివరించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కోరానని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. రూ.లక్ష ఆర్థిక సహాయం అందించేందుకు డైరెక్టర్ల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

ప్రతిపక్షాలపై ఈడీతో అక్రమ కేసులు

మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి


పరిగి: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: కేంద్రం బీజేపీ, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీలపై కుట్రపూరిత రాజకీయాలు సాగిస్తున్నారని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కవిత అరెస్టుకు నిరసనగా శనివారం పట్టణ కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న రెండు పార్టీలు రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను బద్నాం చేసేందుకు అక్రమ కేసులు పెట్టి భయపెట్టేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. కుట్రలకు భయపడే ప్రసక్తే లేదని ఎదురొడి పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ నాగిరెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ శ్యాసుందర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ భాస్కర్, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కుట్రలో భాగమే అరెస్టు

అనంతగిరి: బీజేపీ, కాంగ్రెస్ కుట్రలో భాగంగానే ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేశారని వికారాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కమాల్‌రెడ్డి, జిల్లా నాయకులు రాంరెడ్డి ఆరోపించారు. ఈమేరకు శనివారం వికారాబాద్ పట్టణంలోని ఎన్‌టీఆర్ చౌరస్తాలో ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు నిరసనగా బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ దొంగ నాటకాలను ప్రజలు బయటపెట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. బీఆర్ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక కాంగ్రెస్, బీజేపీలు కుమ్మకై బీఆర్ఎస్ పార్టీ నాయకులను అరెస్టులు, దాడులతో వేధిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్, పురుషోత్తం రెడ్డి , సుభాన్‌రెడ్డి, శివకుమార్, అశోక్, రాజుగుప్తా, గౌస్ , అంజయ్య, సత్యనారాయణ గౌడ్, ఉపేందర్‌రెడ్డి, ముత్తాజ్‌అలీ, మల్లేశం, రమేష్, ప్రవీణ్, గిరీష్, అనిల్ , షఫీ పాల్గొన్నారు.


అనంతగిరి: రాస్తారోకో చేస్తున్న నాయకులు

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

అనంతగిరి: రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం రాత్రి వికారాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే ఎస్‌ఐ శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే స్టేషన్ నుంచి తాండూరు వెళ్లే రైలుమార్గంలో ఎల్లమ్మగుడి దాటాక ఓ వ్యక్తి సాయంత్రం 6గంటల సమయంలో కాచిగూడ–వాడి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి మృతి చెందాడని స్థానికులు తెలిపిన సమాచారంతో అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ విషయమై ఆరా తీయగా మృతుడు దౌల్తాబాద్ మండలానికి చెందిన జీపీ శ్రీను (19)గా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎరువులు తగిన మోతాదులో వాడాలి

వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు

శంషాబాద్ రూరల్: రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించి, తగిన మోతాదులోనే పంటలకు ఎరువులు వాడాలని శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని సుల్తాన్‌పల్లిలో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ రైతులకు స్ప్రేయర్లు, టార్పాలిన్ కవర్లను పంపిణీ చేశారు. రైతులకు అన్ని విధాలుగా సహకారం అందజేస్తామని ఈ సందర్భంగా ఎంపీటీసీ సంగీత సిద్దేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు డాక్టర్ ఏ.మాధవి, డాక్టర్ కె.పవన్‌చంద్రారెడ్డి, రైతులు లక్ష్మయ్య, హంసమ్మ, దర్శన్, యాదయ్య, ఈశ్వరయ్య, మారుతి, ఆగిరెడ్డి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.


సుల్తాన్‌పల్లిలో రైతులకు పనిముట్లు అందజేసిన శాస్త్రవేత్తలు

చెట్లకు నీరు పోయించిన అధికారులు


కందనెల్లితండా వద్ద చెట్లకు నీరుపోస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

పెద్దేముల్: 'పల్లె ప్రకృతి.. చేతల్లో వికృతి' అనే శీర్షికతో శనివారం సాక్షి జిల్లా ఎడిషన్‌లో ప్రచురితమైన వార్తకు మండల అధికారులు స్పందించారు. కందనెల్లితండా ప్రకృతి వనంలో నీరు లేక చెట్లు ఎండిపోతున్నాయంటూ వార్త రావడంతో అధికారులు నీరు పోయించారు. అలాగే, రోడ్లపై నాటిన మొక్కలకు కూడా నీరు పోశారు. ప్రతి చెట్టుకు తప్పకుండా నీరు పోయాలని.. చెట్లు ఎండిపోతే పంచాయతీ కార్యదర్శులదే బాధ్యతని ఎంపీడీఓ జర్నప్ప పంచాయతీ కార్యదర్శులను హెచ్చరించారు. వారంలో రెండు రోజులు గ్రామాల్లో పర్యటించి వన నర్సరీ, పల్లె ప్రకృతి వనాలతో పాటు, రోడ్లపై నాటిన మొక్కలను పరిశీలిస్తానని ఎంపీడీఓ పేర్కొన్నారు. హరితహారంపై జిల్లా కలెక్టర్ సీరియస్‌గా ఉన్నారని అన్నారు. ఇక ముందు చెట్లు నీరు లేక వాడిపోయిన, పాడైన ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నలుగురు కేటుగాళ్ల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమణగౌడ్, సీఐ, ఎస్‌ఐ, తదితరులు

- నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి భూమి కాజేసే కుట్ర
- యజమాని బతికుండగానే డెత్ సర్టిఫికెట్

చేవెళ్ల: కోట్ల రూపాయల విలువ చేసే భూమిపై కన్నేసిన అక్రమార్కులు నకిలీ డ్యాకుమెంట్లు, వారసులను సృష్టించి తమ పేర్లపై రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. భూ యజమాని ఫిర్యాదు చేయటంతో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నకిలీ పత్రాలు తయారు చేసే ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నార్సింగ్ ఏసీపీ రమణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 334, 335ల్లో కాకినాడకు చెందిన ముల్లపూడి వీర వెంకట సత్యనారాయణరావు అతని స్నేహితులు కలిసి 5 ఎకరాల 12 గుంటల భూమిని 2005లో ప్రోగ్రెసివ్ అగ్రో సర్వీస్ అనే ఫామ్‌ను ఏర్పాటు చేసుకొని దీని పేరుపై భూమిని కొనుగోలు చేశారు. ఈ భూమి గురించి తెలుసుకున్న కాకినాడ, విజయవాడ, మచిలీపట్నంకు చెందిన కొందరు వ్యక్తులు ఎలాగైనా కాజేసేందుకు కుట్ర పన్నారు. ఈ భూమికి సంబంధించి నకిలీ డాక్యూమెంట్లను సృష్టించారు. బతికిఉన్న ముళ్లపూడి వీరవెంకట సత్యనారాయణరావు 2014లో చనిపోయినట్లుగా నకిలీ డెత్ సర్టిఫికెట్‌ను సృష్టించటంతో పాటు అతని వారసుడిగా ముదాగుల వరప్రసాద్ అనే వ్యక్తికి నకిలీ ఆధార్ కార్డును తయారు చేశారు. ఇతని ఆధారంతో భూమిని మరో నలుగురు పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. విషయం తెలుసుకున్న అసలు భూ యజమాని వీర వెంకటసత్యనారాణరావు శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు కాకినాడ, విజయవాడకు వెళ్లి వారి పేర్లు, ఫామ్ గురించి విచారించగా వారు చేసిన మోసం బయటపడింది. వారిని విచారించగా నేరం అంగీకరించారు. పోలీసులు దేవగనుగల రామవీర వెంకటవరప్రసాద్, పరుశురాం, పార్థసారథి, పోతునూరి శ్రీనాథ్, విజయభార్గవన్‌లను అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధం ఉన్న మరికొంత మంది వ్యక్తులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారిని కూడా త్వరలో పట్టుకొని అరెస్ట్ చేస్తామని పోలీసులు వివరించారు. కార్యక్రమంలో సీఐ హబీబుల్లాఖాన్, డీఐ నాగరాజు, ఎస్‌ఐ సంతోష్‌రెడ్డిలు ఉన్నారు.

'పది' పరీక్షలకు సిద్ధం

- రేపటి నుంచి ఎగ్జామ్స్
- 829 పరీక్ష కేంద్రాలు.. 1.74 లక్షల విద్యార్థులు హాజరు
- పకడ్బందీగా ఏర్పాట్లు
- ఐదు నిమిషాలు దాటితే అనుమతి నిరాకరణ



సాక్షి, సిటీబ్యూరో: పదవ తరగతి పరీక్షల నిర్వహణకు సర్వ సిద్ధమైంది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పరీక్షలకు అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టింది. సీసీ కెమెరాల నిఘా నడుమ పరీక్షల నిర్వహణ కొనసాగే విధంగా చర్యలు చేపట్టారు. ఒక పరీక్ష కేంద్రంలో సుమారు 200 నుంచి 240 మంది విద్యార్థులు పరీక్షలు రాసే విధంగా ఏర్పాట్లు చేశారు. ఉదయం 9.30 నుంచి 12:30 వరకు పరీక్షలు జరుగనున్నాయి.

1.74 లక్షల మంది విద్యార్థులు

గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మల్కాజిగిరి–మేడ్చల్ జిల్లాల పరిధిలో 1,74,365 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందుకోసం సుమారు 829 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రానికి ఒకరి చొప్పున చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులను కేటాయించారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు.

ఐదు నిమిషాల వరకు ఓకే..

నిర్దేశించిన సమయం కంటే ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించనున్నారు. ఇంతకు మించి లేటుగా వస్తే మాత్రం పరీక్ష కేంద్రంలోకి పంపించబోమని స్పష్టం చేశారు. చివరి నిమిషంలో ఇబ్బంది తలెత్తకుండా విద్యార్థులు పరీక్షా సమయాని కంటే ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని విద్యాశాఖాధికారులు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుతో పాటు పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు కానుంది. పరీక్ష కేంద్రాలకు సమీపంలోగల అన్ని జిరాక్స్ సెంటర్లను పరీక్ష సమయంలో మూసివేసే విధంగా చర్యలు చేపట్టారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్, తాగునీటితోపాటు వేసవి కావడంతో ఫస్ట్ ఎయిడ్ కిట్స్ ఏర్పాటు చేశారు.

కారు బోల్తా పడి.. ఆర్టీసీ మాజీ ఉద్యోగి దుర్మరణం

షాద్‌నగర్‌రూరల్: కారు అదుపు తప్పిబోల్తా పడిన ఘటనలో ఆర్టీసీ మాజీ ఉద్యోగి దుర్మరణం పాలైన ఘటన శనివారం ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ శివారులోని టోల్‌ప్లాజా సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శరత్‌కుమార్ కథనం ప్రకారం.. షాద్‌నగర్ ఆర్టీసీలో సుదీర్ఘకాలంగా పని చేసిన బి.గోవర్ధన్‌రెడ్డి (73) పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఆర్టీసీ కార్మిక నాయకుడిగా ఆయన పట్టణవాసులకు బిజి.రెడ్డిగా సుపరిచితులు. ఆర్టీసీలో రిటైర్మెంట్ తీసుకున్న తరువాత బిజి.రెడ్డి కొంత కాలంగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. శనివారం ఆయన కారు నడుపుతూ హైదరాబాద్ నుంచి స్వగ్రామమైన జడ్చర్లకు వెళ్తున్నాడు. కారు రాయికల్ టోల్ ప్లాజా సమీపంలోకి రాగానే అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయపడిన బిజి.రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ శరత్‌కుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీంతో గోవర్ధన్‌రెడ్డి మృతితో షాద్‌నగర్ ఆర్టీసీ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి బంధువు శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.


మృతి చెందిన బిజి.రెడ్డి